
సాక్షి
శ్రీకాకుళం
శనివారం : 25 : ఫిబ్రవరి : 2023



ప్రయోగాలకు వేళాయె

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ జరగనున్నాయి. అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో



ఆభరణాలు చోరీ

శ్రీకాకుళంలో గురువారం రాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు.

- 8లో

నామినేషన్ల పరిశీలన పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ జి.నవ్య అభ్యర్థుల ప్రపోజల్స్‌ను పరిశీలించి బరిలో వైఎస్సార్‌సీపీ తరఫున నర్తు రామారావు, ఇండిపెండెంట్‌గా ఆనెపు రామకృష్ణ నిలిచినట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27 వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

తప్పిన పెను ప్రమాదం



ఆయిల్ ట్యాంకర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలోని నక్కలపేట గ్రామానికి ఎదురుగా ఉన్న బ్రిడ్జి వద్ద శుక్రవారం హిరమండలం నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న హెచ్‌పీ ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి వంతెనపై నుంచి పడిపోయింది. ఇక్కడ గతంలో ప్రమాదాలు జరిగి ఉండడంతో రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. ఇప్పుడు కూడా అదే ప్రదేశంలో ప్రమాదం జరిగింది. సాధారణంగా అక్కడ ఉపాధి వేతనదారులు పనులు చేస్తూ ఉంటారు. కానీ అదృష్టవశాత్తూ వారు పనులు ముగించుకుని వెళ్లాక బండి బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో వాహనం యజమానులు క్రేన్ ద్వారా ఆయిల్ ట్యాంకర్‌ను బయటకు తీశారు.

సమయపాలన పాటిస్తే గరిష్ట వేతనం



వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

సోంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతన దారులు సమయ పాలన పాటించి రోజుకు 6 గంటలు పని చేస్తే రూ.257 వేతనం అందుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ చిట్టిరాజు అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి హామీ నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఏపీఓ ప్రమీల, ఈసీ శ్రీనివాసరావు, ఏపీడీ జయరాం, సిబ్బంది, వేతనదారులు ఉన్నారు.


ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



అక్కుపల్లి శివసాగర్ తీరానికి చేరిన తాబేలు కళేబరం

వజ్రపుకొత్తూరు రూరల్: ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాతపడుతున్నాయి. వీటి కళేబరాలు అక్కుపల్లి శివసాగర్ తీరం, నువ్వలరేవు, చిన కొత్తూరు తీరాలకు చేరుతున్నాయి. తమ జాతి సంతతిని వృద్ధి చేసేందుకు తీరాలకు వస్తుంటాయి. అలాంటి సందర్భాల్లో వలలకు చిక్కుకుని చనిపోతున్నాయి. అరుదైన సముద్ర జీవులు మృత్యువాత పడుతున్న సంఘటనలు చూసి ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. సముద్ర జీవులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

'పౌష్టికాహారం అందించాల్సిందే'



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గొండు సీతారాం, తదితరులు

ఆమదాలవలస: చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు బాలింతలకు పౌష్టికాహారం ఎట్టి పరిస్థితుల్లోనూ అందించాల్సిందేనని, ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో గల లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తీసుకువస్తుండడాన్ని గమనించి ప్రశ్నించారు. బడిలో భోజనం బాగులేదని చెప్పడంతో అక్షయ పాత్ర యాజమాన్యంతో అక్కడే మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా భోజనాలు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. మరోసారి జరిగితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, ఐసీడీఎస్ పీఓ బాలామణి, సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం. వాసుదేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీరే స్ఫూర్తి.. మీదే కీర్తి

తప్పు చేస్తే పట్టుకోవడం ఖాకీల పని. ఆ తప్పు జరగకుండా చూసుకునే బాధ్యతను కూడా వారిప్పుడు నెత్తిన పెట్టుకున్నారు. దోషులను దండించడం లాఠీలకు తెలిసిన విద్య. దండనే కాదు ఆర్తులకు అండదండలు అందించే క్రతువును వారు మొదలుపెట్టారు. బంగారు బతుకులు చీకటిలోకి జారిపోకుండా చైతన్య కాగడాలు వెలిగిస్తున్నారు. యువత విష వలయంలో చిక్కుకుపోకుండా విషయాలను వివరించి చెబుతున్నారు. స్ఫూర్తి పోలీసు కళాబృందాలతో ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు.

- ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో పోలీసుల వినూత్న కార్యక్రమాలు
- స్ఫూర్తి పోలీసు కళా బృందం పేరిట అవగాహన సదస్సుల నిర్వహణ
- విద్యాలయాల్లో చట్టాలు, సామాజిక అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం



శ్రీకాకుళంలోని డైమండ్ పార్కు వద్ద విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి కళా బృందం



మహిళల భద్రత - మా బాధ్యత పోస్టర్

శ్రీకాకుళం క్రైమ్: సారాయి బతుకులను మార్చడానికి ఆపరేషన్ పరివర్తన్(2.0).. విద్యార్థుల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణకు క్యాంపస్ కాప్స్.. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా అబలలకు అండగా ఉండేందుకు స్ఫూర్తి పోలీసు కళా బృందాలు. ఎస్పీ జీఆర్ రాధిక వినూత్న ఆలోచనలతో విశిష్ట కార్యక్రమాలకు ఊపిరి పోస్తున్నారు. అవగాహన లేమితో అనవసర విషయాల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకుంటున్న వారి కోసం పోలీసులతోనే విజ్ఞాన ప్రదర్శనలు నాటికల రూపంలో ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని మూడు సబ్ డివిజన్లకు ముగ్గురు మహిళా ఎస్‌ఐలను ఇన్‌చార్జిలుగా పెట్టి వీరిని మానిటరింగ్ చేసేలా డీఎస్పీ స్థాయి వ్యక్తిని జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు.

బృందం ఇలా..

- ఒక్కో డివిజన్‌కు ఉత్సాహవంతులైన తొమ్మిది మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసి స్ఫూర్తి పోలీసు కళా బృందంగా తయారు చేశారు.
- వీరు ముందే కొన్ని స్కిట్‌లను ఎంపిక చేసుకుని ఉంటారు.
- ఉదయం పూట కళాశాలలు, పాఠశాలల్లో యాంటీ ర్యాగింగ్ పేరిట ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు అవగాహన పరుస్తూనే.. సాయంత్రం, రాత్రి సమయాల్లో రెండు గ్రామాలను లేదా నేరప్రాంతాలను, ముఖ్య కూడళ్లను, వార్డులను, వీధుల ఎంపిక చేసుకుని అక్కడి మహిళలకు, బాల బాలికల తల్లిదండ్రులకు ఆరు అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు.
- శ్రీకాకుళం దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్ తన పర్యవేక్షణలో జిల్లాలోని మూడు సబ్ డివిజన్లకు (శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ) మహిళా ఎస్‌ఐలైన ప్రవల్లిక, లక్ష్మి, చంద్రకళలను ఇన్‌చార్జిలుగా నియమించారు.
- ఈ బృందాలకు గత నెలన్నర రోజులుగా డీపీవో, పీఆర్వో, క్లూస్ టీం ఎస్‌ఐల సమక్షంలో శిక్షణ ఇప్పించి సిద్ధం చేసినట్లు చెబుతున్నారు.

వీటిపైనే అవగాహన

మహిళల రక్షణకు గల చట్టాలు (ఫోక్సో, దిశ), గుడ్ టచ్–బ్యాడ్ టచ్, స్మార్ట్ ఫోన్ తదితర సోషల్ మీడియాకు బానిస కావడం వల్ల కలిగే దుష్ప్రభావం, మాదకద్రవ్యాలు, ఆల్కహాల్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాలు చేసుకుంటే బాలికలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు– కలిగే నష్టాలు, మోసపూరిత పరిచయాలు, తద్వారా ప్రేమ ద్వారా కలిగే దుష్పరిణామాలు, ప్రస్తుత కాలంలో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం– వ్యవహరించాల్సిన తీరు వంటివాటిపై నాటికలు ప్రదర్శిస్తారు.

మూడు రకాల స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం



పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోతే వారి తప్పుడు న డత, అమ్మాయిలు అబ్బాయి ల మాయమాటలు నమ్మి మో సపోయిన తీరు, బర్త్‌డే పార్టీకి ఫ్రెండ్స్‌తో సరదాగా వెళ్లి అక్కడ మత్తు పానీయాలు తాగి స్పృహ కోల్పోతే వారిపై అఘాయిత్యం ఎలా చేస్తారన్నది కళ్లకు కట్టి నట్లు స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం. ఎస్పీ ఆదేశాలతో 15 రోజుల పాటు నాటక ప్రదర్శనలకు శిక్షణ పొందాం. ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని చెబుతున్నాం.

– ఎ.చంద్రకళ, కె.లక్ష్మి, ఎం.ప్రవల్లిక, కాశీబుగ్గ, టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ల స్ఫూర్తి ఇన్‌చార్జులు

బాలికలు, మహిళల భద్రతే ధ్యేయం



స్ఫూర్తి పోలీస్ కళా బృందంలో 10 మంది ఉంటారు. నా పరిధిలో శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్‌లు ఉన్నాయి. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో నెలలో రెండు రోజుల పాటు కార్యక్రమాలు జరగాలి. ఉదయం పూట ఐదు కళాశాలలు, పాఠశాలలు, సాయంత్రం, రాత్రి పూట రెండు గ్రామాల్లో ఈ ప్రదర్శనలు చేయాలి. మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

– జీఆర్ రాధిక, ఎస్పీ

పోక్సో కేసులు ఆలోచింపజేశాయి



18 ఏళ్లలోపు మైనరు బాలికను ఆమె ఇష్టంతో ప్రేమించినా అది పోక్సో చట్టం ప్రకారం చెల్లదు. పెళ్లి చేసుకుందామన్నా కుదరదు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే వారి పని జైలే. తక్కువ వయసులో వారే ఇలాంటి నేరాల్లో ఉండటం, అమ్మాయిలు బలైపోతుండటం విచారకరం. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారానైనా ఫలితం ఉంటుందని మా ఎస్పీ ఆలోచన.

– డి.వాసుదేవరావు, స్ఫూర్తి పోలీస్ జిల్లా ఇన్‌చార్జి (శ్రీకాకుళం దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ)

గతంలో కంటే భిన్నంగా ఉంది



గతంలో దిశ డీఎస్పీగా లలిత కుమారి ఉండేటప్పుడు పోలీస్ నేషనల్ జెండర్ క్యాంపైన్ నెలరోజుల పాటు లాయర్లు, డాక్టర్లు, మేధావుల సమక్షంలో నిర్వహించాం. దానికంటే భిన్నంగా స్ఫూర్తి పోలీసు కార్యక్రమం ప్రస్తుత రోజులకు అనుగుణంగా ఉంది. అమ్మాయిలు ఏ విషయాన్ని లోపల ఉంచుకోకుండా నిర్భయంగా చెప్పగలిగే ధైర్యాన్ని పోలీసు శాఖ ఇచ్చారు. కార్యక్రమాన్ని రూపకల్పన చేసింది ఓ మహిళా ఎస్పీ అన్నది అమ్మాయిలు గుర్తుంచుకోవాలి.

– డాక్టర్ ఆర్.ప్రమీల, మహిళా సాధికారిత కమిటీ కోఆర్డినేటర్, ఆర్ట్స్ కళాశాల

నూతన గవర్నర్‌తో..





రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'క్యాంపస్ కాప్స్'కు అవార్డు



విజేతల బృందంలో ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: కాలేజీ విద్యార్థులకు సామాజిక బాధ్యత, చట్టాలు, పోలీసు విధులపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చిన 'క్యాంపస్ కాప్స్' కార్యక్రమానికి అవార్డు దక్కింది. కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో శుక్రవారం జరిగిన టెక్నాలజీ సభ అవార్డ్స్–2023 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎస్పీ రాధిక ఈ అవార్డును అందుకున్నారు. నూతన ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి శ్రీకారం చుట్టినందుకు గాను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన క్యాంపస్ కాప్స్‌కు ఈ అవార్డు రావడం సంతోషకరమని ఎస్పీ పేర్కొన్నారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళంతో పాటు కర్నూలు జిల్లాకు ఈ అవార్డు లభించింది.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలి క్రీడాకారులు



జాతీయ పోటీలకు ఎంపికైన టెక్కలి క్రీడాకారులు

టెక్కలి: ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలిలో శాప్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ ఎన్.శేఖర్ శుక్రవారం తెలిపారు.

బాలుర కేడెట్ విభాగంలో 38 కేజీల కేటగిరిలో పి.రాకేష్‌వర్మ, 34 కేజీల కేటగిరిలో ఎస్.లిఖిత్ ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొంటా రని పేర్కొన్నారు. క్రీడాకారులను కోచ్‌లు సురేష్, జగదీష్, బి.నారాయణరావు అభినందించారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు తెలిపారు. ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.నవ్యలతో కలిసి పట్టభద్రులు, స్థానిక సంస్థల శాసన మండలి నియోజక వర్గాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ఘట్టం పూర్తయ్యిందని, నామినేషన్ల పరిశీలన ఉందన్నారు. ఉప కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలు పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తారని తెలిపారు. మార్చి 1న మొదటిసారి, 8న రెండోసారి ఈ శిక్షణలు నిర్వహిస్తామన్నారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ ఏజెంట్లు, సీసీ కెమెరాలు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణపై డీఎస్పీ బాలరాజు వివరించారు. సూక్ష్మ పరిశీలకులకు మార్చి 7న శిక్షణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సింగిల్ విండో సిస్టం పై సెట్విస్ సీఈఓ ప్రసాదరావు వివరించారు. డీటీసీ సమావేశానికి హాజరు కానందున వివరణ తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని సూచించారు.

ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారు ఎన్.చంద్రశేఖరరెడ్డి అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని దినపత్రికలు ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, వాటిని గమనించాలని కోరారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీని విలీనం చేసి 54వేల మంది కార్మికులను ఉద్యోగులుగా చేశారని, రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత 1,30,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, వైద్య రంగంలో సుమారు 20వేల ఖాళీలను భర్తీ చేశారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను త్వరలోనే రెగ్యులర్ చేయనుందని తెలిపారు. సీపీఎస్‌పై కూడా ఒక నిర్ణయం వెలువరించనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇప్పటికే 3 డీఏలు ఇవ్వాల్సి ఉందని, త్వరలోనే ఒక డీఏ విడుదల చేయనుందన్నారు. అలాగే గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా బదిలీ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. ఉద్యోగులు ప్రభుత్వానికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు మాట్లాడుతూ అడ్డదారిలో కొన్ని సంఘాలు వచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా గవర్నర్‌ను కలవడం జరిగిందన్నారు. దీని వల్ల ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోగా మరికొన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఉద్యోగులంతా ఒకేతాటిపై ఉండి పోరాటాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోగలమన్నారు. సమావేశంలో ఎన్‌జీవో సంఘ నాయకులు చల్లా శ్రీనివాసరావు, ఆర్.వేణుగోపాల్, కె.నారాయణరావు, బడగల పూర్ణచంద్రరావు, కె.జయరావు, టి.సోమేశ్వరరావు, ఎంఆర్‌కె దాస్, రాధాకృష్ణ, శ్రీరాం కుమార్, బొత్స శ్రీనివాసరావు, నవీన్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్.. ధరలు స్మార్ట్



జగనన్న మహిళా మార్ట్‌లో అందుబాటులో ఉన్న నిత్యావసర సరుకులు

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ క్రమేపీ కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌లో పప్పు నుంచి ఉప్పు వరకూ ఇంటికి కావాల్సిన నిత్యావసరాలు అన్నీ లభిస్తున్నాయి. బయట మార్కెట్ కంటే ఒకింత తక్కువకే విక్రయిస్తుండడంతో కొనుగోలుదారులు ఇక్కడ షాపింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బయట డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో గల రూ.599 బూస్ట్ జగనన్న మహిళా మార్ట్‌లో రూ.575కే లభిస్తోంది. ఇండియా గేట్ బిర్యానీ సూపర్ మార్కెట్‌లో రూ.217 కాగా జగనన్న మార్ట్‌లో రూ.163కే లభిస్తోంది. రూ.235 విలువ గల సెంటు, పౌడర్ వంటివి రూ.175కే లభిస్తోంది. ఎస్‌హెచ్‌జీ గ్రూప్స్ తయారు చేసిన అప్పడాలు, వడియాలు వంటి వాటిపై 40 శాతం రాయితీ ఇస్తున్నారు.





రాయితీపై తక్కువ ధరకు జగనన్న మహిళా మార్ట్‌లో లభిస్తున్న ఎస్‌హెచ్‌జీ ప్రొడక్ట్స్



జగనన్న మహిళా మార్ట్‌లో తక్కువ ధరకు లభిస్తున్న వస్తువులు

మాస్టారు అడిగారంటూ..

- పాఠశాలల పక్క ఇళ్లే టార్గెట్
- మాస్టారు పేరు చెప్పి డబ్బులు తీసుకుంటున్న వైనం
- లబోదిబోమంటున్న బాధితులు



జీరుపాలెం హైస్కూల్

రణస్థలం:

ఈ నెల 13వ తేదీ. ఉదయం ఏడు గంటలు. జీరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న దుమ్ము సీతమ్మ భర్త గోపి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వెళ్లాడు. పక్కనే ఉన్న స్కూల్ హెచ్‌ఎం అర్జెంటుగా రూ.10వేలు అడిగారంటూ తీసుకున్నాడు.

ఈ నెల 24వ తేదీన తెప్పలవలస పంచాయతీ నీలంపేట ఎంపీయూపీ పాఠశాల పక్కన యాగాటి సోము అప్పయ్యమ్మ అనే వృద్ధురాలి ఇంటికి ఉదయం ఏడింటికి ఎవరో వెళ్లారు. హెచ్‌ఎం నూకరాజు అర్జెంటుగా రూ.10వేలు ఇమ్మన్నారమ్మా.. అని చెప్పగా.. ఆ వృద్ధురాలు తడబడి తన వద్ద లేవని చెప్పారు. అయినా చుట్టుపక్కల వారి పేర్లు చెప్పి రూ.5వేలు తీసుకున్నారు. ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడించి మరో రూ.3వేలు లాగేశారు.

అదే రోజు 8 గంటల సమయంలో కృష్ణాపురం పంచాయతీ గోసాంలో వెలుగు సీఎఫ్‌గా పనిచేస్తున్న బస ఎల్లమ్మతోనూ హెచ్‌ఎం అడిగారని చెప్పి రూ.10వేలు తీసుకున్నారు.



నిజానికి ప్రధానోపాధ్యాయులు డబ్బు లు తీసుకురావాలని ఎవరినీ పంపించలేదు. వారి పేర్లు చెప్పి ఎవరో దుండగులు తెల్ల రంగు స్కూటర్‌పై తెలుపు రంగు దుస్తులు వేసుకుని వచ్చి టోపీ వేశారు. 13వ తేదీనే సీతమ్మకు హెచ్‌ఎం ఎదురుపడగా.. ఇలా ఎవరో డబ్బులు తీసుకున్న మాట చెప్పారు. దీంతో ఆయన ఆశ్చర్యపోయి తానేమీ డబ్బులు అడగలేదని చెప్పే సరికి ఆమెకు మతి పోయింది. మిగతా రెండు ఘటనల గురించి తెలుసుకున్న ప్రధానోపాధ్యాయులు.. తమకు ఎలాంటి సంబంధం లేదని గ్రామాల్లో తమ పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వవద్దని కోరుతున్నారు. సోము అప్పయ్యమ్మ మాట్లాడుతూ ఎవరో వచ్చి మాస్టారు నూకరాజు పేరు చెప్పి డబ్బులు తీసుకున్నారని, టీచర్ పేరు చెప్పి బాగా ప్రాధేయపడడంతో పింఛన్ డబ్బులు ఇచ్చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ త్రినాథ రావు స్పందిస్తూ టీచర్ల పేర్లు చెప్పి డబ్బులు దోచుకున్న మాట వాస్తవమేనని అన్నారు. ఇలాంటి వారిని నమ్మవద్దని కోరారు.

మోసపోవద్దు

టీచర్ల పేర్లు చెప్పి అమాయకులను మోసం చేయడం దారుణం. ఇలాంటి వ్యక్తుల వలలో పడవద్దు. ఈ విషయమై మాకు ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదులు రాలేదు. గుర్తు తెలియని వ్యక్తులు వస్తే పోలీసులకు గానీ, గ్రామ పెద్దలకు గానీ, 100కైనా సమాచారం ఇవ్వాలి.

– జి.రాజేష్, జేఆర్ పురం ఎస్ఐ



నీలంపేట పాఠశాల

క్లుప్తంగా

‘ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు’



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ బీజేపీ ఎమ్మెల్సీగా 2017లో గెలిచిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి తనవంతుగా కృషి చేశానని బీజేపీ ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు అతిథిగృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనమండలి సభ్యునిగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరోసారి ఎన్నుకోవాలని పట్టభద్రులను కోరారు. సమావేశంలో బీజేపీ ప్రతినిధులు పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వర రావు, జి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆవును కాపాడిన సంచార అంబులెన్స్



ఆవు దూడను రక్షించిన సిబ్బంది

పాతపట్నం: మండలంలోని బగంతర గిరిజన గ్రామంలో వండాడ చిన్నయ్యకు చెందిన చూడి ఆవును 1962 వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ కాపాడింది. సకాలంలో గ్రామానికి చేరుకుని ఆవును, దూడను రక్షించారు. దీంతో రైతులు, గ్రామస్తులు పశువైద్య సిబ్బందిని అభినందించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

ప్రయోగాలకు వేళాయె!



శ్రీకాకుళంలోని ఓ కళాశాలలో సిద్ధమైన ప్రాక్టికల్ ల్యాబ్

- రేపటి నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్
- నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షల నిర్వహణ
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 134 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ప్రాక్టికల్స్‌పై సైన్స్ లెక్చరర్లకు సూచనలిస్తున్న ఆర్ఐఓ, ఇతర అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు నేతృత్వంలోని డీఈసీ కమిటీ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే కళాశాలల్లో ల్యాబ్‌లను శుభ్రం చేసి విద్యార్థులను ప్రాక్టికల్స్‌కు సన్నదకధం చేశారు.

నాన్ జంబ్లింగ్ విధానంలో..

మార్చి 7తో ముగియనున్న ప్రాక్టికల్స్‌ను పారదర్శకంగా పూర్తిచేసేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఒకేషనల్ విద్యార్థులకు 20వ తేదీనే ప్రారంభమయ్యాయి. సైన్స్ విద్యార్థులకు మాత్రం ఆదివారం నుంచి ప్రాక్టికల్స్ మొదలవుతాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాలే కేటాయించారు. మొదటి స్పెల్‌లో 81 కేంద్రాలు, రెండో స్పెల్‌లో 74 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని కమిషనరేట్, జిల్లా ఆర్ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ చేశారు.

19,471 మంది సన్నద్ధం..

జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలకు 19471 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూపు నుంచి 13165 మంది, బైపీసీ గ్రూపు నుంచి 6306 మంది విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎగ్జామినర్లు, ఇతర సిబ్బంది నియామకాలు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాలకు బుక్‌లెట్స్‌తోపాటు నామినల్ రోల్స్, ఫొటో నామినల్ రోల్స్ ఇతర పరీక్ష మెటీరియల్స్‌ను చేరవేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షలపై అధికారులు నిఘాపెట్టారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు డీఈసీ కమిటీ సభ్యులు ఆర్.భూషణరావు (ప్రిన్సిపాల్–జీజేసీ బూర్జ), పీవీఎల్ నారాయణరావు (ప్రిన్సిపాల్–జీజేసీ ఎచ్చెర్ల), డి.ఫల్గుణరావు (జేఎల్– జీజేసీ పొందూరు), హైపవర్ కమిటీ కె.అప్పలరాజు (ప్రిన్సిపాల్–జీజేసీ కంచిలి) సభ్యులు, బోర్డు అధికారులు తనిఖీలు చేరపనున్నారు.

పది రోజుల్లోనే పూర్తిచేసేలా..

రాష్ట్రంతోపాటు జిల్లాలోను గతంలో 20 రోజుల పాటు నిర్విరామంగా ప్రాక్టికల్స్ నిర్వహించేవారు. నాలుగు విడతలుగా చేసి, స్పెల్‌కు ఐదు రోజులు చొప్పున కేటాయించేవారు. ఈ ఏడాది రెండు స్పెల్స్‌ను పది రోజుల్లోనే పూర్తిచేసేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంది.

ఏర్పాట్లు పూర్తిచేశాం..



సైన్స్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. వాస్తవానికి ఫిబ్రవరి 20 నుంచే ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు మొదలయ్యాయి. మార్చి 7 వరకు ప్రాక్టికల్స్ కొనసాగుతాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో సీసీ కెమెరాల నిఘాలో స్ట్రీమింగ్ విధానంతో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్ఐఓ శ్రీకాకుళం

విజయదుర్గకు విశేష పూజలు



శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో విజయదుర్గా అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

బంగారం, వెండి ఆభరణాలు చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం పట్టణంలోని గుజరాతీపేట సమీపంలో పొందరవీధిలో (నాయుడు గట్టు చెరువు దరి) గురువారం రాత్రి చోరీ జరిగిందని రెండో పట్టణ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు. పొందరవీధిలో నివాసముంటున్న దున్న మంగ భర్త చనిపోవడంతో కొంతకాలంగా ఫంక్షన్లలో కూరగాయలు కోస్తూ, వంటలు చేస్తూ రేకులషెడ్డు ఇంటిలో జీవనం సాగిస్తోంది. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే కాలనీలో తన సోదరి కూడా ఉంటోంది. ఈ నెల 22న ఇంటికి తాళం వేసి మంగ పొందూరు వెళ్లింది. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు సోదరి మంగ ఇంటికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉండటం చూసి చోరీ జరిగిన విషయం మంగకు ఫోన్‌లో చెప్పింది. మంచం పరుపు కింద ఉంచిన తాళాల సాయంతో బీరువాలో భద్రపరిచిన మూడు తులాల బంగారం (చెవి రింగులు, ఉంగరాలు), 60 తులాల వెండి (గ్లాసులు, కాళ్ల పట్టీలు, చిన్న చిన్న వస్తువులు) పోయినట్లు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మహేంద్ర మాతే, ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ లక్ష్మి, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

‘సహారా ఇండియా’ సమస్యను పరిష్కరించుకుందాం



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు అజయ్‌బాబు

నరసన్నపేట: సహారా ఇండియా కంపెనీలో ఖాతాదారులకు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఏజెంట్లు ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో అంతా కలసి కట్టుగా ఉంటే సమస్యను పరిష్కరించుకోగలమని సహారా ఏపీ ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అజయ్‌బాబు అన్నారు. నరసన్నపేటలోని సహారా ఇండియా ఏజెంట్లు, ఖాతాదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో డిపాజిట్లు, ఇతర ఆర్‌డీల డబ్బులు రావడం లేదన్నారు. ఫీల్డ్ వర్కర్స్ సమైక్యంగా ఉంటే సహారా ఇండియా నుంచి ఖాతాదారులకు డబ్బు ఇప్పించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని, ఏజెంట్లు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా యూనియన్ సభ్యులతో పాటు స్థానిక ప్రతినిధులు రవిబాబు, టి.సత్యనారాయణ, జి.గోపాలం, ఎస్.సెంటబాబు, కేవీపీ రావు, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల సాగుతో భూసారం



ముద్దాడలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ర్యాలీ

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు పంట పొలాల్లో 30 రకాల విత్తనాల సాగుతో భూసారం పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. శుక్రవారం ముద్దాడ గ్రామంలో ‘నవధాన్యాల సాగు–నేల తల్లి బాగు’ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పంట సాగుకు ముందు అపరాలు, చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, నూనె గింజలు వంటి విత్తనాలు వేసి 40 రోజుల అనంతరం పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించాలని సూచించారు. భూమిని 365 రోజులూ కప్పి ఉంచితే సారం పెరుగుతుందన్నారు. ప్రధాన పంటల మధ్య నవధ్యానాలు సాగు చేయడం శ్రేయస్కరమని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ధనలక్ష్మి, అప్పలనర్సయ్య, పోలీస్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న కిసాన్ మజ్దూర్ ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏప్రిల్ 5న జరగనున్న కిసాన్ మజ్దూర్ ర్యాలీలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, పెన్షనర్లు, క్యాజువల్, కాంట్రాక్ట్ ఉద్యోగులు భాగస్వాములు కావాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.లచ్చిరాజు, కె.రమాదేవి పిలుపునిచ్చారు. బీఎస్ఎన్ఎల్ కో–ఆర్డినేషన్ కమిటీ దేశవ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం శ్రీకాకుళం సంచార భవన్ వద్ద ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి 1 నుంచి న్యాయంగా రావాల్సిన 3వ వేతన సవరణ 15 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థలో 4జీ, 5జీ సేవలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావులు మాట్లాడుతూ నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో బీఎస్ఎన్ఎల్ ఆస్తులను, టవర్లను, ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్‌ను బడా కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. నిరసన ప్రదర్శనలో బీఎస్ఎన్ఎల్ ఈయూ నాయకులు కె.గోపాలరావు, ఐ.చరణ్, శంకర్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

25న బట్టిగళ్లూరులో వైద్యశిబిరం

సోంపేట: ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు, యువత, సామాజిక కార్యకర్తలు ముందుకు రావాలని జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము పిలుపునిచ్చారు. సోంపేట కోర్టుల సముదాయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కిడ్నీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, 25న బట్టిగల్లూరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిసర గ్రా మ ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కిడ్నీ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయగలుగుతారని అన్నారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.5.37 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం హుండీ లెక్కింపు శుక్రవారం చేపట్టారు. పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి కార్యనిర్వహనాధికారి టి.వాసుదేవరావు పర్యవేక్షణలో 82 రోజులకు గాను లెక్కింపు చేపట్టగా రూ. 5,37,807 ఆదాయం సమకూరినట్లు ఈఓ వి.వి.సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ప్రత్యేక ఆహ్వానితులు బాడాన గోవిందరావు, అర్చకులు కె.అప్పలరాజు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రణస్థలం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సంఘ రాష్ట్ర కార్యదర్శి గొంటి తిరుపతి రావు అన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ మార్చి 1న జిల్లాకు రానున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం రణస్థలం ఎంపీడీవో ధనుంజయరావును కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి, సహాధ్యక్షులు కిలారి నారాయణరావు, నీలాద్రిరావు, భాస్కరస్వామి, తదితరులు మండల అధికారులను కలిసి కార్యక్రమానికి హాజరై మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ, సబ్ ట్రెజరీ ఆఫీసర్ లిల్లి షారున్, ఎంఈఓ త్రినాథరావు చేతుల మీదుగా సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సచివాలయ జాయింట్ సెక్రటరీ, మండల ప్రెసిడెంట్ గణపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ బమ్మిడి అమ్మోజి, ట్రెజరర్ శంకర్‌రావు పాల్గొన్నారు.

‘టార్గెట్లతో వేధించడం అన్యాయం’



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా శాఖలో ఆచరణ సాధ్యంకాని టార్గెట్లు పేరుతో ఉన్నతాధికారులు కింది స్థాయి ఉద్యోగులను వేధించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ తపాలా ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు అన్నారు. తపాలాశాఖలో ఉన్నతాధికారుల వేధింపులకు వ్యతిరేకంగా శుక్రవారం శ్రీకాకుళం ప్రధాన తపాలాశాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24వ తేదీలోగా నిర్దేశించిన టార్గెట్లను పూర్తి చేయలేదని పోస్టల్ ఉన్నతాధికారులు మరో నాలుగు రోజులు పొడిగించడం దారుణమన్నారు. దీనిని తపాలా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అధికారుల వైఖరి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు గణపతి, రమేష్, హరికిషోర్, శివప్రసాద్, బాబూరావు, జ్యోతీశ్వరరావు, వేణుగోపాలరావు, చంద్రకిరణ్, వెంకటేష్, రాంబాబు, ధర్మారావు, చంద్రశేఖరరావు, ఢిల్లేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపయడిన రాకేష్

సారవకోట: మండలంలోని అంగూరు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం ఊడికలపాడుకు చెందిన పొన్నాన రాకేష్ గాయాలపాలయ్యాడు. చల్లవానిపేట నుంచి పాతపట్నంవైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపు తప్పి సమీపంలో ఉన్న కాలువలో పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన రాకేష్‌ను స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు.

నకిలీ కరపత్రాలపై విచారణ చేపట్టాలి

పలాస: పలాస మండలం బొడ్డపాడులో ఇటీవల మావోయిస్టుల సాధన కమిటీ పేరిట విడుదలైన నకిలీ కరపత్రాలపై పోలీసులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని సి.పి.ఐ.ఎం.ఎల్. లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలో గొడవలు సృష్టించి లబ్ధి పొందడానికి కొంతమంది వ్యక్తులు ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా ఈ కరపత్రాలను విడుదల చేశారని ఆరోపించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు, కుత్తుం దుష్యంతు, మద్దిల కైలాస్, గేదెల జగదీశ్వర రావు, మద్దిల రామారావు, దున్న శ్రీనివాసరావు, పోతనపల్లి అప్పారావు తదితరులు ఉన్నారు.